## సమాచారం

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



మేడ్చల్: మరమ్మతుల కారణంగా కిష్టాపూర్, గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్ రెడ్డి తెలిపారు. కిష్టాపూర్, గోసాయిగూడ గ్రామాలు, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గుండ్లపోచంపల్లి, ఊర్జిత-3, స్టెర్లింగ్ హోమ్స్, ప్రైమెస్ ఎప్లిసన్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

**నాగారం సబ్‌స్టేషన్ పరిధిలో...**

కీసర: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా నాగారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం సరఫరా ఉండదని ఏఈ కామేశ్వరరావు తెలిపారు. ఇందులో భాగంగా ఆర్‌జీకే 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఆర్‌జీకే కాలనీ, హరిదాస్‌పల్లి, అహ్మద్‌గూడ, ఈడెన్‌గార్డెన్, ఇందిరమ్మ కాలనీ, వీఆర్ఆర్ హోమ్స్, సింధువనం తదితర కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించాలని ఏఈ తెలిపారు.

### ఈఎంఆర్ఐలో ఉద్యోగావకాశాలు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ఈఎంఆర్ఐ కేంద్రంలోని కాల్ సెంటర్‌లో పని చేసేందుకు అర్హత, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ ప్రోగ్రాం మేనేజర్ నరేందర్ కోరారు. ఇందుకు ఇంటర్మీడియట్ లేదా డిగ్రీ పాసై, కనీస కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ఈ నెల 23వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు సెల్: 7995061581 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు.

### ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న ఉద్యోగ నియామకాల్లో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గ్రూప్-2, 3, 4 పరీక్షలు రాసే అర్హులైన ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు మూడు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జి.వినోద్‌కుమార్ తెలిపారు. డిగ్రీ, పీజీ కోర్సులు పూర్తి చేసిన ఎస్సీ అభ్యర్థులు మాత్రమే ఉచిత శిక్షణకు అర్హులని, ఉచిత శిక్షణతో పాటు అవసరమైన అధ్యయన సామగ్రి, భోజన ఖర్చులు ఇవ్వనున్నారన్నారు. అర్హులైన ఎస్సీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఈ నెల 31వ తేదీ వరకు సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

### ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

సుభాష్‌నగర్: గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్ కమ్యూనిటీహాలులో బుధవారం పోస్టల్ అధికారుల ఆధ్వర్యంలో సుకన్య సంవృద్ధి యోజన, పీఎంవై పథకం, ఆధార్ నమోదు, ఇన్సూరెన్స్ పాలసీలను నిర్వహించనున్నారని బాలయ్యనగర్ అధ్యక్షుడు నాగేష్ ఓ ప్రకటనలో తెలిపారు. సుకన్య సంవృద్ధి స్కీమ్‌కు 10 సంవత్సరాల లోపు ఆడపిల్లలు, 18 సంవత్సరాల లోపు ఉన్న అబ్బాయిలు పీఎంవై స్కీమ్‌కు అర్హులని, అదే విధంగా ఆధార్ కార్డు అప్‌డేట్, నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని బస్తీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు.



# కంటి వెలుగుకు.. సర్వం సన్నద్ధం

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా రేపటి నుంచి కంటి వెలుగు రెండో విడత**

- 19న పీర్జాదిగూడలో మంత్రి మల్లారెడ్డి, ఘట్‌కేసర్‌లో జెడ్పీ చైర్మన్, మిగతా నియోజకవర్గాల్లో ఆయా ప్రాంతాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలచే ప్రారంభం
- జిల్లాలో మొత్తంగా 27.51 లక్షల మందికి కంటి పరీక్షలు
- జీహెచ్ఎంసీ పరిధిలోని 40 డివిజన్లలో 20.92 లక్షల మందికి..
- 13 పురపాలికల్లో 5.36 లక్షలు, 61 జీపీల్లోనూ కార్యక్రమం

సాక్షి,మేడ్చల్ జిల్లా: రెండో విడత కంటివెలుగు కార్యక్రమాన్ని గురువారం (19వ తేదీ) నుంచి వంద రోజుల పాటు పకడ్బందీగా నిర్వహించేందుకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధికార యంత్రాంగం సర్వం సన్నద్ధమైంది. ఈ నెల 19వ తేదీ నుంచి కార్యక్రమం ప్రారంభం కానుండగా.. ముందస్తుగా మంగళవారం ప్రతీ క్యాంపు ప్రదేశంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ట్రయల్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. అలాగే కంటి వెలుగు క్యాంపులకు అందించిన సామగ్రి, వాటి పనితీరును కూడా వైద్య బృందాలు పరిశీలించాయి.

**స్థానిక ప్రజాప్రతినిధులచే...**

పీర్జాదిగూడలో గురువారం లాంఛనంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని జిల్లా మంత్రి చామకూర మల్లారెడ్డి, ఘట్కేసర్ మండలంలో జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డిలు ప్రారంభిస్తారు. అదేవిధంగా మల్కాజిగిరిలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కుత్బుల్లాపూర్‌లో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కూకట్‌పల్లిలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ రావు, ఉప్పల్‌లో ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి కంటి వెలుగును ప్రారంభిస్తారు.

**వంద రోజులు.. 79 బృందాలు..**

జిల్లాలో గ్రామీణ, పట్టణ జనాభాకు అనుగుణంగా 79 వైద్య బృందాలను నియమించిన యంత్రాంగం ప్రతీ బృందంలో నేత్ర వైద్య సహాయకులు, ఆశ వర్కర్లు, నర్సులు, కంప్యూటర్ ఆపరేటర్లతో సహా ఏడుగురు సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకున్నారు. వంద రోజుల పాటు నిర్వహించే కంటి వెలుగు నిర్వహణకు పక్బందీ ఏర్పాట్లు చేశారు.

**ఒక్కో బృందంలో ఏడుగురు..**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రెండో విడత కంటి వెలుగులో 27,51,810 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 40 డివిజన్ల పరిధిలో 20,92,711 మందికి కంటి పరీక్షలు చేపట్టాలని నిర్ణయించగా.. ఇందుకు గానూ 43 బృందాలను నియమించారు. జిల్లాలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట నగర పాలక సంస్థలు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, దుండిగల్, కొంపెల్లి, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీ పరిధిలో మొత్తంగా 289 డివిజన్లు/వార్డులు ఉండగా.. 5,36,567 మందికి కంటి పరీక్షలు నిర్వహించాలన్న లక్ష్యంతో 22 బృందాలను నియమించారు. అలాగే 61 గ్రామ పంచాయతీల్లో జనాభాకు అనుగుణంగా జిల్లా వైద్య శాఖ 10 బృందాలను నియమించింది. సెలవు దినాలు మినహా వారానికి ఐదు రోజుల చొప్పున వంద రోజుల పాటు వైద్య పరీక్షలు కొనసాగనున్నాయి. పరీక్షించే పరికరాలను, ఆటో రిఫ్రాక్టర్(ఏఆర్) మీటర్లను ప్రభుత్వం పంపిణీ చేసింది.

# శ్రీరంగవరంలో ఎన్‌ఎస్ఓ బృందం సర్వే

మేడ్చల్ రూరల్: మండలంలోని శ్రీరంగవరం గ్రామంలో జాతీయ గణాంకాల అధికారుల బృందం పర్యటించి సర్వే నిర్వహించారు. జాతీయ గణాంక పథకాల అమలు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా జిల్లాలో శ్రీరంగవరం గ్రామాన్ని ఎంపిక చేసిన అధికారులు మంగళవారం సీనియర్ స్టాటిస్టికల్ అధికారి వీఎల్ విజయ ఆధ్వర్యంలో బృంద సభ్యులు గ్రామంలో సర్వే చేపట్టారు. ప్రజల సామాజిక, ఆర్థిక ప్రమాణాలను నిర్ధారణ చేసేందుకు సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వేలో మేడ్చల్ జెడ్పీటీసీ శైలజ, గ్రామ సర్పంచ్ విజయానంద్ రెడ్డి, అధికారులు సురేశ్, నరేశ్, మాధవి, ఉపసర్పంచ్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



సర్వే నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎఓ బృందం

# గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం కేలండర్ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: జిల్లా గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నూతన సంవత్సర కేలండర్‌ను మంగళవారం మేడ్చల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురయ్య అధ్యక్షతన మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ రాజశేఖర్ రెడ్డి, సంఘ నాయకులతో కలిసి కేలండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నర్సింహ గౌడ్, సంఘ నాయకులు మల్లేశ్, వెంకటేశ్, సింహల్, పరమేశ్వర్, బాలేశ్, శ్రీను, కృష్ణ, భాస్కర్, ఆనంద్, సత్యనారాయణ, లక్ష్మణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో...**

మేడ్చల్: రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధికార ప్రతినిధి, గౌడవెల్లి గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో రూపొందించిన న్యూయర్ కేలండర్‌ను టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి తన నివాసంలో మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న రేవంత్‌రెడ్డి

# ఖమ్మం సభకు బీఆర్ఎస్ నాయకులు



ఖమ్మంకు వెళ్తున్న బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ నాయకులు

పోచారం: ఖమ్మంలో నేడు(బుధవారం) జరగనున్న బీఆర్ఎస్ పార్టీ బహిరంగ సభకు పోచారం మున్సిపాలిటీకి చెందిన నాయకులు మంగళవారం ఓఆర్ఆర్ నుంచి ర్యాలీగా బయల్దేరారు. ఈ సందర్భంగా చైర్మన్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో బీఆర్ఎస్ కీలక భూమిక వహిస్తోందని, సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలించేందుకు ఒక రోజు ముందే బయల్దేరుతున్నట్లు చెప్పారు. సభకు వెళ్లిన వారిలో వైస్ చైర్మన్ రెడ్యానాయక్, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ నాయకులు గొంగళ్ల బాలేష్, నల్లవెల్లి శేఖర్, బద్ధం జగన్మోహన్‌రెడ్డి, కౌన్సిలర్ మెట్టు బాల్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు దాసరి శంకర్ ఉన్నారు.

## ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో మంగళవారం వేకువజాము నుంచి చేపట్టిన పారిశుద్ధ్య పనులు మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీయాదవ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెత్తను రోడ్డుపై వేయకుండా చెత్త డబ్బాలు ఏర్పాటు చేసుకుని ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణ వాహనంలోనే వేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి జూట్ బ్యాగుల వాడకం పెంచాలన్నారు. కార్యక్రమంలో జంగయ్య యాదవ్, మాజీ వార్డు సభ్యుడు రహీం, విజయ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పనులు పర్యవేక్షిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

# ప్రజాహితం కోసం సైకిల్ యాత్ర

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వద్దకు చేరవేస్తూ.. వాటిపై అవగాహన కల్పించేందుకు సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నట్లు సీనియర్ జర్నలిస్టు పొన్నాల గౌరీశంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైకిల్ యాత్ర రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో కొనసాగుతుందన్నారు. హరితహారం, భారతీయ ఆధ్యాత్మిక, ప్రజాహితం, సమాజహితం, లోక కల్యాణార్థం అందరికీ ఉచిత విద్య, ఉచిత వైద్యం అందించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఈ యాత్ర ద్వారా విజ్ఞప్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. జీవన స్రవంతి ప్రజాగళం కలం ఛానల్ ఆధ్వర్యంలో కొనసాగే ఈ యాత్ర మంగళవారం కలెక్టరేట్‌కి చేరుకుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, ఏఓ వెంకటేశ్వర్‌రావును మార్యాదపూర్వకంగా కలిసి తనకు ఇంటి స్థలం కేటాయించాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్ర సమాచార పౌర సంబంధాల శాఖ ప్రోత్సాహంతోనే సైకిల్ యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.



అదనపు కలెక్టర్ అభిషేక్‌తో సైకిల్ యాత్ర విశేషాలను తెలుపుతున్న గౌరీ శంకర్

# ‘పది’ విద్యార్థులకు అవగాహన

- 6 పేపర్ల పరీక్షా విధానంపై విద్యాశాఖ ప్రణాళిక
- 40 రోజుల ప్రణాళికతో విద్యార్థులకు అవగాహన

సాక్షి,మేడ్చల్ జిల్లా: పదో తరగతిలో పూర్తి సిలబస్‌తో కొత్తగా తీసుకొచ్చిన ఆరు పేపర్ల పరీక్షా విధానంపై సరైన అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని జిల్లా విద్యాశాఖ యోచిస్తోంది. అందుకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో మార్చి 10 వరకు 40 రోజుల పాటు ప్రణాళిక రూపొందించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే ప్రతీరోజు పాఠశాల సమయానికి ముందు, తర్వాత గంటసేపు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ ఆరు పేపర్ల పరీక్షా విధానంపై విద్యాశాఖ ఉన్నతాధికారులు రూపొందించిన 40 రోజుల ప్రణాళికకు అనుగుణంగా విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే ఆది, రెండో శనివారాల్లో పరీక్షలు పెట్టి.. ఫిబ్రవరి, మార్చిలో రెండు ప్రీఫైనల్ పరీక్షలు జరిపేలా విద్యాశాఖ ఆదేశాల మేరకు చర్యలు చేపడుతోంది. 2022లో 70 శాతం సిలబస్ పరీక్షలు నిర్వహించగా.. ప్రస్తుతం వంద శాతంతో నిర్వహించనున్నారు. సామాన్యశాస్త్ర పరీక్షను ఒకేరోజు రెండు భాగాలుగా ఇవ్వనున్నారు. గతంలో 11 పేపర్లు ఉన్నప్పుడు ఒక పేపర్ సరిగా రాయకున్నా.. తర్వాత రోజు బాగా రాస్తే ఉత్తీర్ణులయ్యే అవకాశం ఉండేది. ఇప్పుడా పరిస్థితి లేకపోవటంతో.. దీనిపై విద్యార్థులకు పూర్తిస్థాయిలో దిశానిర్దేశం చేయాలని విద్యాధికారులు ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ‘పది’ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంతో పాటు 10జీపీఏ పొందడానికి పాటించాల్సిన జాగ్రత్తలను సంబంధిత సబ్జెక్టుల ఉపాధ్యాయులతో విద్యాశాఖ చెప్పిస్తోంది.

**పదిలో 48 వేల మంది విద్యార్థులు..**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 108 ఉన్నత పాఠశాలల్లో 48 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని మూడు జిల్లాల్లోని పదో తరగతి ఉత్తీర్ణత శాతాన్ని పరిశీలిస్తే.. కొత్తగా ఏర్పడిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 2016-17 విద్యా సంవత్సరంలో 85.22 శాతం, 2017-18లో 87.90 శాతం, 2018-19లో 92.98 శాతం, 2020-21లో 92 శాతం ఉత్తీర్ణత సాధించి ముందంజలో ఉన్నట్లు వెలుబడిన పదోతరగతి ఫలితాలను బట్టి తెలుస్తోంది. జిల్లాలోని 108 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోనూ డిజిటల్ విద్యను అమలు చేస్తున్నారు. గతేడాది విద్యార్థులు ఎక్కువగా ఫెయిల్ అయినట్లు భావిస్తున్న గణితం, సామాన్య శాస్త్రం సబ్జెక్టుల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు చర్యలు తీసుకోంటోంది. పాఠశాల పని దినాల్లో ఉదయం బాలికలకు, సాయంత్రం బాలురకు ఒక గంట అదనంగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తోంది. వారానికి దాదాపు 12 పిరియడ్స్ బోధిస్తున్న ఉపాధ్యాయులు ఇందులో నాలుగు పిరియడ్లు గణితం, ఐదు పిరియడ్లు సామాన్య శాస్త్రం, మూడు పిరియడ్లు సాంఘిక శాస్త్రం, ఆంగ్లం, తెలుగు బోధించేలా చర్యలు తీసుకుంటోంది. పదో తరగతి విద్యార్థులను ఫిబ్రవరి నుంచి ప్రతి రోజు ఉదయం 4 నుంచి 5 గంటల వ్యవధిలో ఫోన్ల ద్వారా నిద్ర లేపేందుకు కూడా ఉపాధ్యాయులను కేటాయించటంతో పాటు వారి పని తీరును పర్యవేక్షించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది.



# జాతీయ రహదారిపై.. వెలుగులు అంతంతే!

- అత్వెల్లిపై మున్సిపాలిటీ పాలకుల చిన్నచూపు
- చెక్‌పోస్ట్ నుంచి ఐటీఐ వరకే సెంట్రల్ లైటింగ్
- ఐటీఐ నుంచి అత్వెల్లి వరకు వెలగని లైట్లు

మేడ్చల్: అధికారులు, పాలకుల వివక్షతతో మేడ్చల్ మున్సిపాలిటీ మీదుగా వెళ్లే 44వ జాతీయ రహదారిపై సగమే వెలుగులు కనిపిస్తున్నాయి. 44వ జాతీయ రహదారిపై మేడ్చల్ పారిశ్రామిక వాడ నుంచి అత్వెల్లి రేకులబావి వరకు దాదాపు 5 కిలో మీటర్ల దూరంలో మున్సిపాలిటీ పరిధి రహదారి ఉంది. అత్వెల్లి, మేడ్చల్ గ్రామ పంచాయతీలుగా ఉన్న సమయంలో నాటి సర్పంచ్‌లు రెండు గ్రామ పంచాయతీల పరిధుల్లో జాతీయ రహదారిపై సెంటర్ లైట్లు ఏర్పాటు చేసి వెలుగులు నింపారు. దీంతో జాతీయ రహదారిపై వెలుతురు ఉండటంతో ప్రమాదాలు తగ్గాయి. ఆ తర్వాత మున్సిపల్ ఆవిర్భవించాకా నాటి ప్రత్యేకాధికారులు సెంటర్ లైటింగ్‌పై దృష్టి పెట్టకపోవడంతో అవి శిథిలావస్థకు చేరి పని చేయకుండా పోయాయి. ప్రస్తుతం పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు గడుస్తున్నా సెంటర్ లైట్లపై పెద్దగా దృష్టి పట్టడం లేదు. పారిశ్రామికవాడ నుంచి ఐటీఐ వరకు నూతన లైట్లు ఏర్పాటు చేసి దీపాలు అమర్చి వెలుతురు తెచ్చారు. కూడళ్ల వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా అత్వెల్లి పరిధిలో ఉన్న జాతీయ రహదారిని పాలకులు పట్టించుకోవడం లేదు. కిలో మీటర్ దూరం మేర పాత స్తంభాలు ఉన్నా మున్సిపల్ అధికారులు గానీ, పాలకులు గానీ సెంటర్ లైటింగ్ ఏర్పాటునకు పట్టించుకునే పాపాన పోవడం లేదు. నూతనంగా ఏర్పాటు చేయకపోయినా కనీసం ఉన్న పాత వాటికి కనీస మరమ్మతులు చేయడం లేదు. లోటస్ యూటర్న్ వద్ద రెండు నెలల క్రితం విద్యుత్ దీపాలు లేక చీకట్లో ద్విచక్రవాహనాలు ఢీకొని ఒక మహిళ, మరో వ్యక్తి మరణించినా కనీస ఏర్పాట్లు చేయలేదు.



మేడ్చల్ పరిధిలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్



ఐటీఐలో స్తంభం ఉన్నా అలంకార ప్రాయంగానే...

**అత్వెల్లిపై వివక్ష ఎందుకు..?**



మేడ్చల్ మున్సిపాలిటీలో భాగమైన అత్వెల్లిపై అధికారులు, పాలకులు ఎందుకు వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదు. అత్వెల్లి నుంచి పన్నులు వసూలు చేస్తున్నా వసతులు మాత్రం కల్పించడం లేదు. జాతీయ రహదారిపై అత్వెల్లి పరిధిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు.

– జాకట ప్రేందాస్, అత్వెల్లి

**అత్వెల్లి మున్సిపాలిటీలో భాగం కాదా..?**



అత్వెల్లి గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో మంచి అభివృద్ధి సాధించింది. మేడ్చల్ మున్సిపాలిటీ ఏర్పాటు సమయంలో అత్వెల్లి మున్సిపాలిటీలో విలీనం కావడంతో అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. కనీస వసతులు కల్పించడంలో మున్సిపాలిటీ అధికారులు, పాలకులు పూర్తిగా అత్వెల్లిని విస్మరిస్తున్నారు.

– ఈశ్వర్, అత్వెల్లి

# కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలి

**లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య**



సూచనలు ఇస్తున్న అడిషనల్ కలెక్టర్ అగస్త్య

మేడ్చల్: కంటి వెలుగు రెండో విడతలో భాగంగా ఈ నెల 19 నుంచి మేడ్చల్ మున్సిపాలిటీలో ప్రారంభమయ్యే కార్యక్రమ ఏర్పాట్లను జిల్లా లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. 1వ వార్డులోని ముకుంద ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఆయన సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శిబిరానికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. రోగుల నమోదు, పరీక్షలు, అద్దాల పంపిణీ అన్ని పకడ్బందీగా చేయాలని సూచించారు. వైద్యులు స్థానికంగానే నివాసముండేందుకు మిషన్ భగీరథ ట్యాంక్‌ల వద్ద ఉన్న గెస్ట్‌హౌజ్‌ను కేటాయించి పరిశీలించారు. కార్యక్రమంలో కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా, ఆర్ఐ రాంచందర్, కౌన్సిలర్ మానస శ్రవణ్‌కుమార్ వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి**



కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: కంటి సంబంధిత సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వం అమలు పర్చిన రెండో విడత కంటి వెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జవహర్‌నగర్ కమిషనర్ రామలింగం అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని 28 డివిజన్లలో కంటి వెలుగు శిబిరాలను ఏర్పాటు చేశామని, కంటి వెలుగు పథకంతో అంధత్వ నివారణే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలన్నారు. కార్పొరేషన్‌లోని ప్రజలందరికీ కంటి పరీక్షలు చేయాలని, అవసరమైన వారికి మందులు అందివ్వాలని ఆయన అధికారులకు సూచించారు.

**అంకిరెడ్డిపల్లిలో ట్రయల్ రన్...**



అంకిరెడ్డిపల్లిలో ట్రయిల్ రన్ నిర్వహిస్తున్న దృశ్యం

కీసర: కంటి వెలుగు కార్యక్రమాన్ని వివిధ గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కీసర మండల వైద్యాధికారి డాక్టర్ సరితారెడ్డి అన్నారు. కంటి వెలుగు రెండో విడతలో భాగంగా మంగళవారం అంకిరెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించిన ట్రయిల్‌రన్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరితారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 19 నుంచి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో కంటివెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ఇందిరా, ఆశ వర్కర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

**శామీర్‌పేట్‌లో ట్రయల్ రన్...**

శామీర్‌పేట్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టే కంటి వెలుగు పథకాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్ఓ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం మూడుచింతలపల్లి గ్రామ పంచాయతీలో కంటివెలుగు ట్రయల్ రన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవి, ఎంపీహెచ్ఓ కాశీనాథ్, స్థానిక సర్పంచ్ రవి, మండల వైద్యాధికారి దమయంతి, ఎంపీటీసీ నాగరాజు, సర్పంచ్‌లు కృపాకర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మూడుచింతలపల్లిలో ట్రయల్ రన్ నిర్వహిస్తున్న వైద్యులు

**కాచవానిసింగారంలో సమీక్ష...**

ఘట్‌కేసర్: కాచవానిసింగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ వెంకట్‌రెడ్డి, వైద్యాధికారి భాగశ్రీ ఆధ్వర్యంలో కంటి వెలుగు రెండో విడతపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి వెలుగును విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వైద్య సిబ్బంది మౌనిక, సునంద, కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ గీత, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కాచవానిసింగారం సర్పంచ్ వెంకట్‌రెడ్డి